క్లుప్తంగా

నేడు 'సిద్ధం' మండల స్థాయి సమావేశం

రాయవరం: మండలంలోని చెల్లూరు గ్రామ పరిధిలోని చింతా సుబ్బారాయుడు ఫంక్షన్ హాలులో సోమవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని మండల సచివాలయ కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ సమావేశంలో మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, బూత్ కమిటీల ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు అందరితో కలిపి 'ఎన్నికలకు సిద్ధం' సమావేశానికి హాజరు కావాలన్నారు.

ఎంపీడీఓ నరేంద్రరెడ్డి బదిలీ



రాయవరం: రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల బదిలీలు చేపడుతున్నారు. అందులో భాగంగా రాయవరం ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డిని పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ చేశారు. అయితే రాయవరం మండల ఎంపీడీఓగా ఇంకా ఎవరినీ నియమించారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం పంచాయతీ విస్తరణాధికారి శ్రీనివాస్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో హజరత్ ఆలీ గంధోత్సవం



ద్రాక్షారామలో గుర్రంపై గంధాన్ని ఊరేగిస్తున్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: ముస్లింల ఆరాధ్యులు ఇమాం హజరత్ ఆలీ ముష్కిల్ కుషా గంధోత్సవం ఆదివారం ద్రాక్షారామలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సౌదీ అరేబియాలోని మక్కా ప్రాంతంలో రజ్జబ్ నెల 13వ రోజు ఆలీ జన్మించడంతో.. ఈ పవిత్ర దినాన్ని ఏటా ముస్లింలు ఆనందోత్సాహాలతో జరుపుకొంటారు. దీనిలో భాగంగా గుర్రంపై పంజేషా నుంచి ఇమాం హుస్సేన్ పంజా, పంజతని పంజాల మీదుగా గంధం, ప్రసాదం గుర్రంపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ద్రాక్షారామతో పాటు, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ముస్లిం భక్తులు పాల్గొన్నారు.

వెంకన్న కుటుంబానికి సూర్యప్రకాశ్ పరామర్శ



యాళ్ల వెంకన్న కుటుంబీకులను పరామర్శిస్తున్న సూర్యప్రకాశ్ తదితరులు

కాజులూరు: గుండెపోటుతో ఇటీవల మృతి చెందిన స్థానిక నాయకుడు యాళ్ల వెంకన్న (78) కుటుంబీకులను ఆదివారం రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ పరామర్శించారు. యాళ్ల వెంకన్నకు భార్య వెంకటసుబ్బమ్మ, కుమారుడు ధనరాజు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గ్రామ పెద్దగా పలు స్థానిక సమస్యల పరిష్కారంలో ఆయన చేసిన కృషిని సూర్యప్రకాశ్ కొనియాడారు. సర్పంచ్ దండంగి సరోజిని చిన్నారావు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు యాళ్ల నరసింహమూర్తి, పెంకే విశ్వేశ్వరరావు, సలాది నానాజి, కాదా నాగరాజు, కట్టా శేఖర్, వసలపూడి లోవరాజు, కడలి సత్తిపండు, వాసంశెట్టి వెంకన్న, రాజేష్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

క్రీడాకారులకు టీషర్టుల అందజేత



ఖోఖో క్రీడాకారులకు టీషర్టులు అందజేసిన ఆర్యావటం బోస్ ఆర్మీ టీం సభ్యులు

కాజులూరు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో ఖోఖో విభాగంలో విజయపథంలో పయనిస్తున్న గొల్లపాలెం క్రీడాకారులకు ఆర్యావటం బోస్ ఆర్మీ టీం సభ్యులు ఆదివారం టీషర్టులు అందజేశారు. ఈ సందర్భంగా బోస్ ఆర్మీ టీం సభ్యులు పాలిక వీరబాబు, పెంకే ప్రసాద్, కొప్పిశెట్టి స్వామి తదితరులు మాట్లాడుతూ గొల్లపాలెం ఖోఖో టీం క్రీడాకారులకు గ్రామీణ స్థాయి పోటీల నుంచి మండల, నియోజకవర్గ స్థాయి పోటీల్లో విన్నర్లుగా నిలిచారన్నారు. వీరు త్వరలో జరగనున్న జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ టీషర్టులు ఇచ్చామన్నారు.

దుష్ట చతుష్టయంపై పోరుకు సిద్ధం

- ప్రతి కుటుంబానికి ప్రభుత్వ లబ్ధి
- ప్రతి ఇంటికీ వెళ్లి సగర్వంగా చెప్పండి
- వైఎస్సార్ సీపీ మండపేట మండల శ్రేణులకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దిశా నిర్దేశం



పోరుకు సిద్ధం సమావేశానికి హాజరైన మండపేట మండల కార్యకర్తలు



తాపేశ్వరంలో కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): మరో 70 రోజుల్లో ఎన్నికల్లో జరగనుండగా, ప్రజలకు జరుగుతున్న మంచికి కాళ్లు అడ్డు పెడుతున్న దుష్ట చతుష్టయంపై పోరుకు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పిలుపు నిచ్చారు. మండపేట మండలంలోని 12 గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకుల, కార్యకర్తలు, గృహ సారథుల, వలంటీర్ల, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. తాపేశ్వరం గ్రామంలో ఆదివారం ఈ సమావేశం జరిగింది. పోరుకు సిద్ధం పేరుతో విశాఖ జిల్లా భీమిలిలో వైఎస్సార్ సీపీ అధినేత ఎన్నికల శంఖారావాన్ని పూరించిన విషయం తెలిసిందే. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు మండల విస్తృత స్థాయి సమావేశాన్ని ఎమ్మెల్సీ నిర్వహించారు. ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కురుపూడి భవాని, 12 గ్రామాల పార్టీ అధ్యక్షుల పర్యవేక్షణలో పెద్ద ఎత్తున కార్యకర్తలు సమావేశమయ్యారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరి, రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, యువనేత తోట పృథ్వీరాజ్ మాట్లాడుతూ ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు కార్యకర్తలంతా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయలేని సంక్షేమ పథకాలను సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేశారన్న విషయాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ రాజకీయాల్లో కల్లబొల్లి మాటలు చెబితే వినే రోజులు ప్రజల్లో పోయిందన్నారు. చెప్పింది చేసి చూపించిన వారి వెంటే ప్రజలు ఉంటారన్నారు. ఈ విషయం పలు దఫాలుగా నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నిరూపితమైందన్నారు. మంచి చేస్తే ఒక వ్యక్తి వెంట జనం ఎలా నడుస్తారో భీమిలిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు తరలి వచ్చిన జనం నిరూపించారన్నారు. ప్రభుత్వం ప్రజలు ఏమిచ్చినా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఇచ్చిన ఘనత గత ప్రభుత్వాల్లో ఎక్కడా చూడలేదన్న విషయాన్ని ప్రజలు గుర్తు పెట్టుకుంటారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ప్రభుత్వ లబ్ధి అందక సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులపై ప్రజలు అసహనంతో ఉండేవారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులతో పాటు వలంటీర్లకు సైతం గౌరవ భావం దక్కుతుందన్న విషయాన్ని గమనించాలన్నారు.

పోరుకు సిద్ధం సీఎం సభకు సన్నద్ధం కండి

వచ్చేనెల 1న ఏలూరు సమీపంలోని దెందులూరులో పోరుకు సిద్ధం పేరుతో నిర్వహించే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభకు నియోజకవర్గ ప్రజలను సమీకరించేందుకు సన్నద్ధం కావాలని పార్టీ కార్యకర్తలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదేశించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లా ప్రజలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మమేకం అవుతారన్నారు. సభకు తరలి వెళ్ళేందుకు వాహనాలు, సన్నాహక సమావేశాలు నిర్వహణ తదితర అంశాలపై గ్రామ నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

కార్యకర్తల్లో ఉత్సాహం...

మండలంలోని తాపేశ్వరం, ఏడిద, మారేడుబాక, అర్తమూరు, ద్వారపూడి, ఇప్పనపాడు, కేశవరం, మెర్నిపాడు, పాలతోడు, వెలగతోడు, జెడ్ మేడపాడు, వేములపల్లి గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పోరుకు సిద్ధం సమావేశానికి తరలి వచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో ఉండడమూ, సీఎం జగన్ పాలనాతీరును ప్రశంసించడం సమావేశంలో ఉత్సాహాన్ని నింపింది. ప్రతి ఇంటికీ మంచి చేశాం, కాలర్ ఎగరేసుకుని ఇంటింటికి వెళ్లి సగర్వంగా చేసిన మంచిని చెప్పండన్నపుడు కార్యకర్తలు కరతాళ ధ్వనులతో ఎమ్మెల్సీ తోట పిలుపును స్వాగతించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పసుమర్తి నాగేశ్వరరావు, జి.కమల, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాస్, 12 పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, నామినేటెడ్ బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ ప్రజాభిప్రాయ సేకరణ

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి వార్షికాదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఈ నెల 29 నుంచి 31 వరకు మూడు రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం ఈఈ వై.విజయానంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు ముందుగా నమోదు చేసుకున్న వారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలు, సలహాలు తెలియజేయవచ్చన్నారు. నమోదు చేసుకోని వారు కూడా విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితో తమ అభిప్రాయాలను, సలహాలను తెలియజేయవచ్చని చెప్పారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రామచంద్రపురం: మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పలు గ్రామాల్లో ఎంపీ బోస్ పర్యటన



దంగేరులో గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న ఎంపీ బోస్

కె.గంగవరం: మండలంలోని దంగేరు, కోటిపల్లి, కొత్తకోట, సుందరపల్లి గ్రామాల్లో ఆదివారం రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పలు సంఘాలకు చెందిన పెద్దలను మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో తన కుమారుడు పిల్లి సూర్యప్రకాశ్‌కు మద్దతివ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పెద్దలు ఎంపీ బోస్‌ను దుశ్శాలువా, పూలదండలతో సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పండు గోవిందరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బత్తుల అప్పారావు, మండల పరిషత్ వైస్ కొప్పిశెట్టి లక్ష్మణ్, పార్టీ నాయకులు వల్లభరెడ్డి చిన్ని, చిట్టూరి చిన్ని, సర్పంచ్ పంపన సత్యానందం, మండల యువజన నాయకుడు జుత్తుక శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంటలపై పందుల స్వైర విహారం



తర్లంపూడిలోని పొలంలో చొరబడి వరి పంటను నాశనం చేస్తున్న పందులు

కాజులూరు: మండలంలోని తర్లంపూడిలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. నిన్నటివరకూ గ్రామ వీధుల్లోను, ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రం ఆవరణల్లోను విచ్చలవిడిగా సంచరిస్తూ, పరిసరాలను అస్తవ్యస్తం చేస్తున్న పందులు.. తాజాగా పంటలపైనా విరుచుకుపడుతున్నాయి. పందుల దాడితో ఆయా పొలాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దాళ్వాలో సాగునీటి ఎద్దడి కారణంగా పొలాల్లో నీరు తక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో పందులు పొలాల్లో సంచరిస్తున్నాయి. పొలం మధ్యకు వెళ్లి, చిగుర్లు వేస్తున్న వరి మొక్కలను కొరికి తింటున్నాయి. పందులు పొలాన్ని తొక్కి, చిందరవందర చేస్తున్నాయని రైతులు చెబుతున్నారు. తర్లంపూడి, జగన్నాథగిరి గ్రామాల సరిహద్దులో రహదారికి ఇరువైపులా జగన్నాథగిరికి చెందిన కొందరు పాకలు వేసి, పందులు పెంచుతున్నారని, రాత్రి సమయాల్లో పందులను తమ గ్రామంలోని పొలాల్లోకి వదులుతున్నారని రైతులు చెబుతున్నారు. పందులను తమ గ్రామంలోకి వదలకుండా చర్యలు తీసుకోవాలని గొల్లపాలెం పోలీసులకు ఫిర్యాదులు చేసినా, జగన్నాథగిరి పెద్దల సమక్షంలో తగువు పెట్టినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. పందుల స్వైరవిహారాన్ని అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మానవత ఆశ్రమంలో ప్రత్యేక వైద్య శిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాయవరం: లొల్ల గ్రామంలోని విశ్వ మానవత ఆశ్రమంలో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. విశ్వ మానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాస చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో వికలాంగులకు కృత్రిమ కాళ్లు అమర్చారు. బధిరులకు వినికిడి యంత్రాలు (హియరింగ్ ఎయిడ్స్) అందించారు. వారికి స్పీచ్ థెరపీ నిర్వహించారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించిన వైద్య శిబిరంలో ఇంగ్లాండ్ నుంచి వచ్చిన డాక్టర్ రఘునాథ్ వైద్య సేవలు అందించారు. 24 మందికి వినికిడి పరీక్షలు, 30 మందికి వినికిడి యంత్రాలు అమర్చారు. అలాగే 15 మందికి కృత్రిమ కాళ్లను అమర్చారు. అలాగే పలువురు చిన్నారులకు స్పీచ్ థెరపీ నిర్వహించారు. ప్రముఖ వైద్యులు సత్యనారాయణ, ప్రకాష్‌లు హోమియో పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. యోగా గురువు, బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నియోజకవర్గ కబడ్డీ విజేత బెల్లంపూడి



కబడ్డీ విజేతగా నిలిచిన బెల్లంపూడి జట్టు

పి.గన్నవరం: జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా కబడ్డీ పోటీల్లో పి.గన్నవరం మండలం బెల్లంపూడి గ్రామ సచివాలయం జట్టు విజేతగా నిలిచింది. సెమీ ఫైనల్‌లో అంబాజీపేట మండలానికి చెందిన జట్టుపై, ఫైనల్‌లో అయినవిల్లి మండలానికి చెందిన జట్టుపై విజయం సాధించి విజేతగా నిలిచింది. దీంతో బెల్లంపూడి జట్టు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. నియోకవర్గ స్థాయిలో విజయం సాధించిన ఈ జట్టుకు ప్రభుత్వం రూ.35 వేలు, ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్లను అందజేయనుంది. ఈ టీమ్‌ను బెల్లంపూడి సర్పంచ్ బండి మహలక్ష్మి, మహలక్ష్మి ట్రస్టు చైర్మన్ బండి రమేష్ తదితరులు అభినందించారు.

చేసిన మేలును చెప్పండి

- 'సిద్ధం' సభను విజయవంతం చేయండి
- నియోజకవర్గ కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్



కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

రామచంద్రపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఐదేళ్ల కాలంలో ప్రజలకు చేసిన మేలును, సంక్షేమాన్ని తెలియజేస్తూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని తిరిగి విజయపథంలో నడిపించేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ దిశానిర్దేశం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని రామచంద్రపురం రూరల్, అర్బన్, కాజులూరు, కె.గంగవరం మండలాలకు చెందిన సచివాలయ పార్టీ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి ఒకటిన ఏలూరులో జరిగే సిద్ధం సభకు సంబంధించిన సన్నాహక సమావేశానికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ నవరత్నాలతో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ ఈ ఐదేళ్ల కాలంలో సంక్షేమ పథకాలు అందాయన్నారు. లబ్ధి పొందిన ప్రతి లబ్ధిదారుడు రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రత్యేక ప్రచార కార్యకర్తగా వ్యవహరించేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండా, నేరుగా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారని, అయితే ప్రతిపక్ష పార్టీలు దీనిపై దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో అందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండేలా క్షేత్ర స్థాయిలో ప్రచారం చేయాలన్నారు. తిరిగి దళారీ వ్యవస్థ రాకుండా చూడాలని, నిజమైన సంక్షేమం అందిస్తున్న జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవశ్యకతను తెలియజేయాలని కోరారు. ఫిబ్రవరి ఒకటిన ఏలూరులో నిర్వహిస్తున్న సిద్ధం సభను జయప్రదం చేసి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని అందరికీ తెలియజేసేందుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, నియోజకవర్గంలోని సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

బాలబాలాజీ స్వామిని దర్శించుకున్న ప్రముఖులు



జ్యుడీషియల్ సభ్యుడు ప్రసాద్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న చైర్మన్ రామకృష్ణ

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. చండీగఢ్ జ్యుడీషియల్ సభ్యుడు పీఎస్ఎన్ ప్రసాద్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ (సీఏఓ) పోలీస్ ఆఫీసర్ సి.గోవిందరాజన్ బాల బాలాజీ స్వామివారిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన బాలాజీ స్వామిని దర్శించుకున్న అనంతరం అర్చకుల నుంచి మహదాశీర్వచనం అందుకున్నారు. వారికి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ గ్రంథి మాధవి స్వామివారి శేష వస్త్రం అందించారు. అలాగే స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యుడు చిట్టాల సత్తిబాబు, ఉప ప్రధానార్చకులు మద్దాలి తిరుమల శింగరాచార్యులు, ఆలయ అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

స్వామి వారికి రూ.1.17 లక్షల ఆదాయం

అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి ఆదివారం వివిధ సేవల ద్వారా రూ.1.17 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాద విక్రయం, దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.86,161 ఆదాయం లభించింది. నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.31,103 విరాళాలుగా సమర్పించారు. 2,369 మంది భక్తులు స్వామిని దర్శించుకోగా, 1,584 మంది అన్న ప్రసాదం స్వీకరించారు.

కుప్పకూలిన వృక్షం

అమలాపురం టౌన్: కొంకాపల్లి ఎత్తు రోడ్డులో ప్రధాన రోడ్డుపై ఓ వృక్షం శనివారం రాత్రి కుప్పకూలి విద్యుత్ తీగలపై పడింది. తీగలు తెగి రోడ్డు మీద పడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

ఎస్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎస్‌టీయూ రాయవరం మండల శాఖ నూతన సారథులు

రాయవరం: ఎస్‌టీయూ రాయవరం మండల శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ విషయాన్ని ఆ సంస్థ మండల గౌరవాధ్యక్షుడు యాకల విశ్వేశ్వరరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. స్థానిక మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌టీయూ నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దేవరకొండ సుబ్బారావు, పంపన వీరవెంకట రమణ, ఆర్థిక శాఖ కార్యదర్శిగా రాయవరపు భాస్కరరావు ఎన్నికయ్యారు. మండలంలోని ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి శక్తి వంచన కృషి చేస్తామని ఎస్‌టీయూ నేతలు తెలిపారు. అలాగే ఎస్‌టీయు జిల్లా కౌన్సిలర్లు వెలగల భామిరెడ్డి, బండారు శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షులుగా మల్లేశ్వరపు రామకృష్ణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో రాయవరం మండల కార్యకర్తలతో పాటుగా అనపర్తి, బిక్కవోలు, కపిలేశ్వరపురం మండలాల ఎస్‌టీయు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌బీఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు మెషీన్ల పంపిణీ



అర్తమూరులో బహుమతిని అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ బుల్లిస్వామిరెడ్డి, అతిథులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం అర్తమూరుకు చెందిన ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు మహిళల ఆర్థిక స్వావలంభనకు విశేషంగా కృషి చేస్తోందని ట్రస్టు 28వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. అర్తమూరులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమాన్ని ట్రస్ట్ చైర్మన్ సత్తి బుల్లిస్వామి రెడ్డి, శ్రీదేవి దంపతులు, ట్రస్ట్ వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణ్ రెడ్డి, అపరంజి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తాపేశ్వరం, మాచవరం, కుతుకులూరు, రామవరం, అనపర్తి గ్రామాలకు చెందిన శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్లను అందజేశారు. పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. ట్రస్టు చైర్మన్ సత్తి బుల్లిస్వామిరెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యం, మహిళాభ్యుదయం సాధన లక్ష్యంగా ట్రస్టు ద్వారా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ కోనాల సత్తిరెడ్డి, ట్రస్ట్ సభ్యులు వెలగల శివారెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, ఓగిరెడ్డి రామారెడ్డి, జీవీఎస్ఎన్ మూర్తి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వశిష్ట నదీపాయపై వంతెన నిర్మించండి

కేంద్ర సహాయ మంత్రి స్వామికి లంక ప్రజల వినతి



వైపీ పాలెం వద్ద లంక గ్రామాల ప్రజలతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నారాయణస్వామి

పి.గన్నవరం: పశ్చిమ గోదావరి జిల్లా ఆనగర్లంక, పెదమల్లంక గ్రామాల నుంచి కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం యర్రంశెట్టివారిపాలేనికి వశిష్ట నదీపాయపై వంతెన నిర్మించాలని ఆయా ప్రాంతాల ప్రజలు ఆదివారం కేంద్ర సహాయ మంత్రి అబ్బయ్య నారాయణ స్వామికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం పి.గన్నవరం సభకు వెళ్తున్న స్వామిని వైపీ పాలెం వద్ద లంక ప్రజలు కలిసి తమ ఇబ్బందులను వివరించారు. తమ గ్రామాలు పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో ఉన్నప్పటికీ, పి.గన్నవరం మండలానికి మార్గం ఉందని, వరదల సమయాల్లో రహదారి నీట మునిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు మంత్రికి వివరించారు. గతంలో ఇక్కడ వంతెన నిర్మాణానికి రూ.9.5 కోట్లు మంజూరైనా, టెండర్లు ఖరారు కాకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయని తెలిపారు. వంతెన నిర్మించి తమను ఆదుకోవాలని మహిళలు, గ్రామస్తులు కోరారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసి, వంతెన నిర్మించేందుకు కృషి చేస్తానని మంత్రి అన్నారు. వంతెన నిర్మించాల్సిన ప్రాంతాన్ని కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటితో కలిసి స్వామి పరిశీలించారు. లంకల్లో ప్రజల జీవన విధానాన్ని, వారి ఉపాధి కోసం ప్రభుత్వం ఇస్తున్న సి–క్లాస్ లీజు పట్టాలపై ఆర్డీఓ వివరించారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, సీఐ ప్రశాంతకుమార్, నాయకులు ఆకుమర్తి చిన్న మాదిగ, కొల్లి సూర్యారావు, సిర్రా పాపారావు, తవిటికి కృష్ణమూర్తి, సిర్రా శ్రీరామ్, ఆకుమర్తి చిట్టిబాబు, శ్రీను, సాయిబాబు, తవిటికి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి సన్నిధిలో మురళి కోలాటం



అంతర్వేదిలో కోలాట భజన బృందంతో అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధిలో ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన హరే శ్రీనివాస కోలాట భజన మండలి ఆధ్వర్యంలో బృందం మురళి కోలాటం ఘనంగా నిర్వహించారు. శ్రీనివాసునిపై ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, అర్చకుడు పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

దేవస్థానంలో వచ్చే నెల 16 నుంచి 25 వరకూ జరిగే స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో స్వామికి భక్తులు సమర్పించే తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం, అంతర్వేదిలో దేవస్థానం భూములకు మూడేళ్ల కాలానికి సాగు చేసే కౌలుహక్కుకు సోమవారం ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఏసీ సత్యనారాయణ తెలిపారు.